క్లుప్తంగా

స్వచ్ఛంద సేవాసంస్థచే నిత్యావసరాల పంపిణీ



తెనాలి: స్వచ్ఛంద సేవాసంస్థ 'లుక్' ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామలింగేశ్వరపేట లోని 40 మంది పేదలకు బియ్యం, గోధుమపిండి, నూనె వంటి సరుకులను పంపిణీ చేశారు. సంస్థ తెనాలి ప్రవీణ బృందం కోటేశ్వరరావు, ప్రసన్న, ప్రసన్నకుమారి, కీర్తి, అస్మత్‌తార, సహాన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లుక్ కల్చరల్ మీడియా లిమిటెడ్ అనే సంస్థ అమెరికా ప్రధాన కేంద్రంగా 2021లో ప్రారంభమైందని ప్రవీణ తెలిపారు. రాబర్ట్‌కేరీ నేతృత్వంలోనీ సంస్థకు లూసీ మేనేజరుగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. పేదరిక నిర్మూలన ప్రధాన ఆశయంగా స్వచ్ఛంద సేవలను అందిస్తూ సంస్థ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్టు వివరించారు.

అనుమతి లేని ఫ్లెక్సీలపై కమిషనర్ ఆగ్రహం



తెనాలి: పట్టణంలోని బోసురోడ్డులో కొద్దిరోజులుగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతను స్వయంగా చూశారు. సంబంధిత కంట్రాక్టరుకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై వ్యాపార సంస్థలకు చెందిన ఫ్లెక్సీలను గమనించారు. ఫ్లెక్సీలను ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించడంతో సిబ్బంది వాటిని తీసేశారు.

గంగానమ్మపేటలో ధనుర్మాస పుష్పయాగం



తెనాలి: స్థానిక గంగానమ్మ పేటలోని పారడైజ్ గృహసముదాయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పుష్పయాగం నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తికీర్తనల గాయని శారదా చలపతి బృందం స్వామి, అమ్మ వార్లకు పంచామృత అభిషేకం చేశారు. శ్రీసూక్త పురుషసూక్త విధానంతో సహస్ర నామార్చనలతో విష్ణు, లలితా, లక్ష్మీ సహస్ర నామాలతో పుష్పార్చన చేశారు. పుష్పయాగంలో బంతి, చామంతి, గన్నేరు, మల్లె, జాజి, గులాబీ, మందార, పారిజాతపూలు, మరువం, ధవనం వంటి సుగంధభరిత పుష్పాలను వినియోగించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. శుభశ్రీ, నగరాజ కుమారి, శ్రీదేవి, అరుణ, అనిత, ప్రత్యూష, మీనాక్షి, శ్రీనివాసమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ విలువ మార్పుల పరిశీలన

తెనాలిరూరల్: ఆస్తుల/భూముల మార్కెట్ విలువ త్వరలో పెంచే అవకాశం ఉండడంతో తెనాలిలోని ప్రస్తుత భూముల వివరాలు, విలువ వంటి అంశాలను మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ బుధవారం పరిశీలించింది. పట్టణ ఐతానగర్, మండలంల గ్రామంల కఠెవరంలో కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల స్థలాల బహిరంగ మార్కెట్ విలువ ఇతర వివరాలను అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. ఏఏ ప్రాంతాల బహిరంగ మార్కెట్ ధర ఎంత ఉంది? ఎక్కడ పెంచాలి? ఎక్కడ తగ్గించవచ్చు అన్న అంశాల గురించి త్వరలో నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు అధికారులు తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాలపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి నిడుబ్రోలు స్టేషన్‌ల మధ్య మోదుకూరు స్టేషన్ సమీపంలో సుమారు 30 నుండి 32 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని, ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ వెంకటాద్రి కోరారు.

కాలనీలో దారులు అస్తవ్యస్తం

- ప్రహసనంగా మారిన ఉడా కాలనీ అంతర్గత రోడ్లు
- స్థానికులు మొరపెట్టుకుంటున్నా కనికరించని పాలకులు, అధికారులు

తెనాలిరూరల్: పట్టణ చెంచుపేటలోని ఉడా కాలనీ, అమరావతి ప్లాట్స్‌లలోని అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. 13 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలనీలో దెబ్బతిన్న రోడ్లపై రాకపోకలు సాగిస్తూ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గాలతో పాటు అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీజీటీఎం ఉడా తెనాలిలో 1980లో 97.42 ఎకరాల భూమిని సేకరించింది. వృద్యాదాయ వర్గాలు (ఎంఐజీ), అల్పాదాయవర్గాలు (ఎల్ఐజీ), పేదవర్గాలు (ఇడబ్ల్యుఎస్) కోసమని 288, 153, 106 చదరపు గజాల ప్లాట్లను ఏర్పాటు చేశారు. అమరావతి ప్లాట్స్, ఉడా కాలనీ రూపుదాల్చి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ కనీస వసతులు సవుకూరలేదంటే ఆశ్చర్యం కలుగుతోంది. చెంచుపేట ఉమేష్‌చంద్ర విగ్రహం నుంచి అమరావతి ప్లాట్స్ శివారులోని ఇందిరానగర్‌కాలనీకి వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా ఉంది. ఈద్గా మైదానం వద్ద నుంచి రోడ్డు దెబ్బతింది. ఉడా కాలనీలో బీటీ రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఈ కాలనీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ముఖ్యంగా అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించాలంటే సీనియర్ సిటిజన్లకు నరకయాతనగా ఉంది. ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోందని, కనీసం రోడ్ల మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



మార్గ్ అపార్ట్‌మెంట్ వద్ద గతుకులమయంగా రోడ్డు



గుంతలమయంగా ఉన్న ఇందిరా నగర్‌కు వెళ్లే రోడ్డు

అనేక సార్లు విన్నవించాం



కాలనీలో ప్రజా సమస్యల గురించి అనేక సార్లు అధికారులకు విన్నవించాం. కాలనీ ఏర్పాటు చేసిన సందర్భంలో ఇక్కడ ప్లాట్లను కొని ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇప్పటికీ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కాలనీ వేసిన ఉడా సౌకర్యాల కల్పన విషయంలో దశాబ్దాలు నిర్లక్ష్యం చేసింది. పురపాలక సంఘం స్వాధీనం చేసుకున్నాక సమస్యలు తీరతాయంటే అదీ జరగడం లేదు. రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిని అనేక ఇబ్బందులు పడుతున్నాం.

–గుమ్మడి నారాయణరావు,
అమరావతి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

సీనియర్ సిటిజన్లకు తీవ్ర ఇబ్బందులు



30, 32 వార్డుల్లో విస్తరించి ఉన్న అమరావతి ప్లాట్స్ ఉడాకాలనీలో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్లలో ప్రయాణించాలంటే ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. సీనియర్ సిటిజన్లకు మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అత్యవసరంగా రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో పడే ఇబ్బందులు అంతా ఇంతా కావు.

–జి. పూర్ణచంద్రరావు,
అమరావతి కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి

సాయంత్రం ఇసుక రీచ్‌లు నిర్వహించొద్దు



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దారు సిద్ధార్థ

కొల్లిపర: ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది ఇసుక తవ్వకాలు ప్రారంభించిన వారు ప్రభుత్వ నిబంధనలు మేరకు సాయంత్రం 6 గంటల తరువాత ఇసుక తవ్వకాలు చేయవద్దని, రీచ్‌లో ఎటువంటి జేసీబీ మిషన్లు వాడవద్దని తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దారు జి.సిద్ధార్థ నిర్వాహకులకు సూచించారు. బుధవారం స్థానిక రెవె న్యూ కార్యాలయంలో బొమ్మువానిపాలెం 14, 15వ మున్నంగి ఇసుక రీచ్‌ల నిర్వాహకులతో గత రెండు రోజుల నుంచి రీచ్‌లలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత మిషన్ల ద్వారా లోడింగ్ చేస్తున్నారన్న ఆరోపణలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం ఆరు తరువాత ఏ వాహనం కూడా ఇసుక లోడింగ్‌తో రోడ్డు పై ఉంటే అటువంటి వాహనం సీజ్ చేసి జరిమానా విధించటం జరుగుతుందన్నారు. పరిమితి మించి ఇసుక లోడింగ్ చేయరాదని తెలిపారు. నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి రీచ్‌లను పూర్తిగా నిలిపివేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ బెల్లం శ్రీనివాసరావు, ఎస్ఐ పి.కోటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఉప్పల రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణా, ఇసుక రీచ్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి

తెనాలిరూరల్: పండుగకు సొంత ఊర్లకు వెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు. సంక్రాంతి సందర్భంగా సెలవులకు దూరప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబరుని స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అట్లాగే విలువైన వస్తువులు, నగదు ఇంటిలో ఉంచవద్దని, బంగారు నగలు బ్యాంకు లాకర్లో భద్రపరచుకోవాలని చెప్పారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా తమతో పాటు తీసుకెళ్లాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు ముందుగానే సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా ద్వారా చోరీలను నియంత్రించవచ్చని తెలిపారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు



ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీకళానిలయం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు

కొల్లిపర: ఈనెల 13 నుంచి 15వ తారీకు వరకు శ్రీకళా నిలయం ఆధ్వర్యంలో స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో గాదె సుబ్బా రెడ్డి కళావేదికపై సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకళా నిలయం అధ్యక్షులు జొన్నల అమ్మిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శ్రీకళా నిలయం కార్యాలయంలో కార్యక్రమాల పాంప్లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ఈనెల 13న (సోమవారం) డాక్టర్ సి.నారాయణ రెడ్డి స్మారక కళాప్రాంగణం సహకారంలో సాయంత్రం 6 గంటలకు మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యం, 8 గంటలకు విజేతలు బాలల సాంఘిక నాటిక, 9 గంటలకు విడాకులు కావాలి నాటిక, 14న భీమవరపు తాతిరెడ్డి గుడిబండి తిరుమలరెడ్డి స్మారక కళాప్రాంగణం సహకారంతో ఉదయం 10 గంటలకు మండలస్థాయి మహిళలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 7 గంటలకు జానపద నృత్య ప్రదర్శన కోలాట ప్రదర్శన 8.30కి సభా కార్యక్రమం, 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కీర్తిశేషులు గుడిబండి కృష్ణారెడ్డి స్మారక ప్రతిభా పురస్కారం గుడిబండి సాయిప్రసాదరెడ్డి సహకారంతో ఉపకార వేతనం బహుకరణ, 9.30 కి ఏఆర్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు, వివేక మోడల్ స్కూల్ విద్యార్థుల చేత ప్రత్యేక నృత్య ప్రదర్శనలు, 15న అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళాప్రాంగణం సహకారంతో సాయంత్రం 6.30 కి పాడాలని ఉంది సినీ సంగీత విభావరి, 8.30కి 14వ తారీకున జరిగిన రంగవల్లి ముగ్గుల పోటీలల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం, 9 గంటలకు ఇది అతని సంతకం నాటిక ప్రదర్శన వంటి వివిధ కార్యక్రమాలు మూడు రోజు లు పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలస్థాయి ముగ్గుల పోటీలల్లో పాల్గొనతలచిన మహిళలు 14వ తేదీ ఉదయం 10 గంటల లోపు వారి పేర్లు శ్రీకళానికయం కార్యాలయంలో వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గుడిబండి సోమ శేఖరరెడ్డి, భీమవరపు కోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పిల్లల ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభం



మఠంబజారు అంగన్‌వాడీలో ఆధార్ కేంద్రం

తెనాలి: స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఆదేశాలతో సున్న వయసు నుంచి ఆరేళ్ల వయసు పిల్లల కోసం ఆధార్ నమోదు కేంద్రాలను పట్టణంలో ప్రారంభించారు. స్థానిక 13 వార్డు లోని అంగన్‌వాడీ కేంద్రంలో రెండు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణ మారీసుపేటలోని మఠంబజార్, రజకపేటలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం నాలుగు ఆధార్ కేంద్రాలను గత రెండురోజుల్లో ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో పిల్లల ఆధార్ నమోదుతో పాటు తల్లిదండ్రుల వివరాలు చేర్పులు, మార్పులు కూడా చేస్తారని, ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మేనేజరు సునీత తెలియజేశారు. ఆమె ఆధార్ కేంద్రాలను సందర్శించి వివరాలను వెల్లడించారు. బ్లూ–3 ఐటీ సంస్థ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పార్వతీపురం, మన్యం, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతంలో గిరిజన ప్రజలకు సుమారు మూడు లక్షల మందికి ఆధార్‌ను నమోదుచేసినట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తమనం రాజేష్ తెలిపారు. తన స్వగ్రామం తెనాలిలో ఆధార్ కేంద్రాలను ప్రారంభించటం సంతృప్తిగా ఉందన్నారు. అవసరమైతే మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్‌వైజర్ సౌజన్య , బ్లూ 3 ఐటీ సొల్యూషన్ సంస్థ ఆధార్ రీజనల్ కో–ఆర్డినేటర్ డేవిడ్ కమలాకర్, మొబైల్ ఆధార్ కో–ఆర్డినేటర్స్ డేవిడ్, నాగరాజ్, రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై కాంగ్రెస్ నిరసన



విద్యుత్ డీఈఈ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ సాంబశివుడు, నాయకులు

తెనాలిరూరల్: తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆందోళన చేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ వెంటనే విద్యుత్ చార్జీలను తగ్గించాలని నినాదాలు చేశారు. తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. అదనపు చార్జీలు వసూలు చేయటం వల్ల విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అలాగే అవినీతితో కూడుకున్న సోలార్ విద్యుత్ కాంటాక్ట్‌ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, ఓబీసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గురప్రు ద్వారకా శ్రీనివాస్, పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, టి శివన్నారాయణ, రాయప్ప, శంకరరావు, కె. వీరస్వామి, బి. శ్రీను, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- 14 గ్రామాల్లో నిర్వహణ
- మొత్తం అర్జీలు 111
- పరిష్కరించినవి 32
- పరిష్కరించనివి 79



రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సిద్ధార్థ



అర్జీదారుతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

కొల్లిపర: గ్రామాల్లో రైతులకు ఎన్నో ఏళ్లుగా ఉన్న వివిధ భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలో 14 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆఖరి రెవెన్యూ సదస్సు మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సదస్సులకు తహసీల్దారు జి.సిద్ధార్థ పాల్గొని భూ సమస్యలున్న వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీ నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు. కొల్లిపర మండలంలో 14 గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలతో పాటు వివిధ సమస్యల పై రైతులు 111 అర్జీలు అందించగా ఇప్పటి వరకు 32 అర్జీలు పరిష్కరించామని, మిగిలిన 79 అర్జీలు కాల పరిమితి లోపు వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వివిధ శాఖలకు చెందిన అర్జీలను పరిశీలించి తగు అధికారికి బదిలీ చేయటం జరుగుతుందన్నారు. కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ముగింపు సదస్సులో 5 అర్జీలు వచ్చిన నట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణా, వీఆర్వో భాస్కర్, సబ్‌రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

తెనాలిలో...

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసాయి. తెనాలికి సంబంధించి ఐతాగర్‌లో నిర్వహించిన చివరి సదస్సులో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. అర్జీదారులతో మాట్లాడారు. ఈ సదస్సులో సర్వే కోసం 17, మ్యుటేషన్ కోసం రెండు అర్జీలు వచ్చాయి.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తెనాలి పట్టణం, మండలంకు సంబంధించి 13 సదస్సులను నిర్వహించామని, వీటిలో మ్యుటేషన్ కోసం మొత్తం 131, సర్వే కోసం 148 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే కొన్ని అర్జీలను పరిష్కరించినట్టు తెలిపారు. త్వరలో అర్జీలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పారు. దేవదాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భావనారుషి స్వామి కల్యాణోత్సవాలకు అంకురార్పణ



'అంకురార్పణ'లో దేవస్థానం కమిటీ, పద్మశాలీ సంఘ నేతలు

తెనాలి: పట్టణ షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 17వ తేదీ వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 30వ తేదీన శ్రీస్వామి వారిని పెండ్లి కుమారుడిని చేస్తారు. అదే రోజు రాత్రి ధ్వజారోహణ ఉంటుంది. 31న నెమలి వాహనోత్సవం, ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం నెమలి వాహనోత్సవం, రాత్రి పొగడ మానోత్సవం, 2వ తేదీన రాత్రి శ్రీ స్వామి వారికి భృంగీశ్వర వాహనోత్సవం, అమ్మవారికి గజ వాహనోత్సవం వేడుకగా చేస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ తెల్లవారుజామున కల్యాణోత్సవం జరుగుతుంది. అదేరోజు సాయంత్రం పులి వాహనోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన సన్నాహాల్లో భాగంగా దేవస్థానం వద్ద అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ చిన్నం హరిగోపాల్, పద్మశాలి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తెనాలి పద్మశాలి యూత్ నాయకులు గుంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటును అడ్డుకోవటం అప్రజాస్వామికం



తెనాలి: పట్టణ రజక చెరువు సెంటరులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై అధికారుల ఆంక్షలు సరికాదని సీనియర్ న్యాయవాది, విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవ సభ్యుడు పిల్లి విద్యాసాగర్ అన్నారు. విగ్రహం ఏర్పాటునకు సంబంధించి అన్ని అనుమతులు ఉండగా నిర్మాణాన్ని అడ్డుకోవడంలో పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించటం దుర్మార్గమైన చర్య అన్నారు. స్థానిక అయితానగర్ పొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్లో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ నిర్మాణాలను అడ్డుకున్న పోలీసులు తీరు అప్రజాస్వామికమని అన్నారు. చట్టబద్ధంగా అన్ని అనుమతులు 2010లోనే అప్పటి జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులుకు సమర్పించినట్లు చెప్పారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంపై అప్పటి కలెక్టర్ ఆర్డీఓ, డీఎస్పీ, ఆర్ అండ్ బీ, మున్సిపల్, విద్యుత్‌శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అవాంతరాలు సృష్టించినా ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. వీరితో అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు కోడూరు బాబు, పిల్లి వాసు, కారుమంచి రవికుమార్, గడ్డటి సుందర్ సునీల్, బేతాళ ప్రభాకర్, అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అబ్రహం లింకన్, యంద్రపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు



ఆక్రమణలను తొలగిస్తున్న పొక్లెయిన్

తెనాలిరూరల్: తెనాలి చంద్రబాబు నాయుడు కాలనీలో కాల్వగట్టు పక్కన ఎంతో కాలంగా ఉన్న అంకమ్మ తల్లి మందిరాన్ని మున్సిపల్ అధికారులు ఇటీవల తొలగించిన విషయం తెలిసిందే. పురపాలక సంఘ రోడ్డును ఆక్రమించి ఉండడంతో ప్రస్తుతం ఆ ప్రదేశంలో మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల సమక్షంలో ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో కొన్ని ఆక్రమణలు, రాళ్లను తొలగించారు. కాల్వకు రోడ్డుకు మధ్యలో ఇనుపకంచె ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గుడి వద్ద కొన్నేళ్లుగా పూజలు నిర్వహించుకుంటున్న స్థానికులు కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా నిత్యం పూజలు చేసుకునే తమ గుడిని తొలగించారని ఇప్పుడు అక్కడకు వెళ్లేందుకు కనీసం దారి కూడా లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారంటూ వాపోయారు.